క్లుప్తంగా...

'సమస్య మీది-పరిష్కారం మాది' అంశంపై త్వరలో సదస్సు

నాంపల్లి: యునైటెడ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్టర్స్ కౌన్సిల్, హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా సంస్థల సంయుక్తాధ్వర్యంలో సమస్య 'మీది-పరిష్కారం మాది' అనే అంశంపై త్వరలో ఒక సదస్సును నిర్వహిస్తున్నట్లు యునైటెడ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్టర్స్ కౌన్సిల్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ అమ్మిరెడ్డి రజిని ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయవాది అయ్యప్పతో పాటుగా పలువురు నిష్ణాతులైన న్యాయకోవిధులు సదస్సుకు సమస్యలకు పరిష్కారం చెప్తారని వివరించారు. ఈ సదస్సుకు హాజరు కాదలచిన వారు ముందుగా తమ పేరును నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 99088 49785లో సంప్రదించవచ్చు.

రేపు మంత్రి తలసాని అధ్యక్షతన సమావేశం

చార్మినార్: బోనాల జాతర ఉత్సవాల నిర్వాహణ, ఏర్పాట్లు తదితర అంశాలపై ఈ నెల 26న ఉదయం 11.30 గంటలకు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధ్యక్షతన ఉన్నత స్థాయి అధికారుల సమావేశం జరగనుందని భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు ఆలె భాస్కర్ రాజ్, ప్రధాన కార్యదర్శి గాజుల రాహుల్ తెలిపారు. రాబోయే ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలపై ఈ సమీక్షా సమావేశం బేగంపేటలోని హరిత టూరిస్ట్ ప్లాజా రెండో అంతస్తులో జరగనుందన్నారు. పాతబస్తీలోని ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ప్రతినిధులు, ప్రతి ఆలయం నుంచి కేవలం ఇద్దరు ప్రతినిధులు మాత్రమే ఈ సమావేశానికి హాజరుకావాలన్నారు.

అబిడ్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాస్ వర్మ



అబిడ్స్: అబిడ్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా జి.శ్రీనివాస్ వర్మ పదవీ బాధ్యతలు స్వీకరించారు. కొంతకాలంగా విధులు నిర్వహించిన సుధాకర్ నారాయణగూడ పోలీస్‌స్టేషన్ డీఐగా బదిలీ కావడంతో ఆయన స్థానంలో కామాటిపురా పోలీస్‌స్టేషన్ డీఐ శ్రీనివాస్ వర్మను కమిషనర్ నియమించారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ.. స్థానిక ప్రజల సహకారంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా కృషి చేస్తామన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అధిక ప్రాధాన్యత ఇస్తానన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు సక్రమంగా పాటిస్తే ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కావన్నారు. అన్ని ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా కృషి చేస్తామన్నారు.

'బీసీలపై ఎందుకు ఇంత వివక్ష'

అఫ్జల్‌గంజ్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలపై సవితి తల్లి ప్రేమ చూపిస్తోందని ప్రజా ఏక్తా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు నర్సింగ్‌రావు ఆరోపించారు. ఈ మేరకు బుధవారం గౌలిగూడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీలను ప్రసన్నం చేసుకునేందుకు రూ.10లక్షలతో కూడిన దళితబంధు పథకాన్ని ప్రకటించగా, రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన బీసీలకు అది కూడా చేతివృత్తి చేసే వారికి మాత్రమే రూ. లక్ష అందజేస్తామనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దళిత బంధు తరహా ప్రతిఒక్క బీసీకి రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



చార్మినార్: బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ బుధవారం సూఫీ సెయింట్ ఖ్వాజా మహబూబ్-ఈ-ఇలాహీ సుల్తాన్-ఉల్-మషైఖ్ దర్గాలో పూలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ శాంతికి చిహ్నంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ప్రపంచం ఆశగా, విశ్వసంతో చూస్తుందన్నారు.

'బ్రాహ్మణ భవన్' ప్రారంభోత్సవానికి తరలిరావాలి

మణికొండ: గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం కేసీఆర్ బ్రాహ్మణులకు అన్ని అవసరాలకు పనికొచ్చేలా నిర్మించిన బ్రాహ్మణ భవన్ ప్రారంభోత్సవానికి పెద్ద ఎత్తున బ్రాహ్మణులు తరలి రావాలని భాగ్యనగర అర్చక, పురోహిత సంఘం, బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మండవ మధుసూదనశర్మ పిలుపునిచ్చారు. ఈ నెల 31న గోపన్‌పల్లిలో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా భవన్‌ను ప్రారంభిస్తున్నారన్నారు.

అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం

మంత్రి శ్రీనివాస్ యాదవ్



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి శ్రీనివాస్ యాదవ్

చాంద్రాయణగుట్ట: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని ఉప్పుగూడ మహంకాళి ఆలయంలో రూ.4.96 కోట్లతో చేపట్టనున్న మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...పేద, మధ్య తరగతి ప్రజలకు అనుగుణంగా ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని రకాల కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. పేదల కోసమే ఈ ఫంక్షన్ హాల్‌ను నిర్మిస్తున్నామన్నారు. చాంద్రాయణగుట్టలో మరో నాలుగు ఇలాంటివి మంజూరు చేయడం జరిగాయన్నారు. ఉమ్మడి దేవాయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే బోనాల ఉత్సవాలకు ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు, జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ సామ్రాట్ అశోక్, ఆలయ కమిటీ చైర్మన్ జనగామ మధుసూదన్‌గౌడ్, ఉప్పుగూడ డివిజన్ కార్పొరేటర్ ఫహద్ బిన్ అబ్దాద్, మాజీ కార్పొరేటర్ సమద్ బిన్ అబ్దాద్ తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ కోట పూజారిగా అవకాశం కల్పించాలి



మంత్రి తలసానితో పూజారి సురేష్ చారి

గోల్కొండ: గోల్కొండ కోటపై కొలువుదీరిన గోల్కొండ జగదాంబిక మహంకాళి ఆలయంలోని మహంకాళి ఆలయ పూజారిగా శాశ్వతంగా నియమించాలని ఆలయ పూజారి బొమ్మల సురేష్ చారి రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఎన్నో ఏళ్లుగా ఆలయ పూజారిగా కొనసాగుతున్నానని ఆయన ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. కాగా రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ అధికారులతో మాట్లాడి అవసరమైన నియామకపత్రాలు జారీ అయ్యేలా చూస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

ఆలయాల నిర్వహణకు సంపూర్ణ సహకారం



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ ఈఓ శ్రీనివాసరాజు తదితరులు

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని ఆలయ నిర్వాహకులకు అన్ని రకాలుగా సహాయ సహకారం అందిస్తున్నానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. నానల్‌నగర్ డివిజన్ తిరుపల్లిగడ్డలోని కోవెల రంగనాథస్వామి ఆలయ ప్రాంగణంలో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన ఆహ్వాన పత్రాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి ఈ. శ్రీనివాసరాజు బుధవారం ఎమ్మెల్యేను కలిసి అందజేశారు. ఆలయ ప్రాంగణంలో లక్ష్మీనరసింహాస్వామి సమేత గోదా రంనాథస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన కోసం నూతనంగా ఆలయాన్ని నిర్మించడం జరిగిందని, ఈ దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన ఈనెల 31న నిర్వహిస్తున్నామని కార్యనిర్వహణాధికారి ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయ పరిరక్షణ కోసం తాను ఎప్పుడూ కూడా రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ అధికారులకు ఆలయ నిర్వాహకులకు సంపూర్ణ సహాయ సాహకారం అందిస్తున్నానన్నారు. ఆలయాల వద్ద జరిగే ఉత్సవాల సందర్భంగా ఆలయ నిర్వాహకులతో మాట్లాడి ఆలయాల వద్ద ఏర్పాట్ల కోసం తన వంతు కృషి చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.నర్సింహ తదితరులున్నారు.

సన్మానం



మాధవీలతకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శేఖర్‌రెడ్డి తదితరులు

గోల్కొండ: శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణకు కృషి చేస్తానని లంగర్ హౌస్ ఇన్‌స్పెక్టర్ మాధవిలత అన్నారు. లంగర్‌హౌస్ ఇన్‌స్పెక్టర్‌గా కొత్తగా నియమితులై పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా బుధవారం కార్వాన్ బీఆర్‌ఎస్ హడ్‌హక్ కమిటీ సభ్యుడు శేఖర్‌రెడ్డి ఆమెను కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ... తెలంగాణ పోలీసుల పని తీరు దేశంలోనే నెం.1 అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు శేఖర్ యాదవ్ తదితరులున్నారు.

బీఆర్‌ఎస్ హయాంలో క్రిస్టియన్లకు గౌరవం



సాల్మన్‌రాజుకు మద్దతుగా సమావేశం

గోల్కొండ: బీఆర్‌ఎస్ హయాంలోనే తెలంగాణలో క్రిస్టియన్‌లకు సముచిత గౌరవం ఇవ్వబడుతుందని టోలిచౌకి డివిజన్ నీరజ కాలనీలోని ఇమాన్యుయెల్ వర్షిప్ సెంటర్ పాస్టర్ ప్రభాకర్‌రావు అన్నారు. గవర్నర్ ఎమ్మెల్సీ కోటాలో గోనె సాల్మన్ రాజుకు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని కోరుతూ బుధవారం వర్షిప్ సెంటర్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వర్షిప్ సెంటర్ సలహాదారులతో పాటు ఎక్జిక్యూటివ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు ఏకగ్రీవంగా గోనె సాల్మన్ రాజుకు మద్దతుగా తీర్మానం చేశారు. యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉంటూ గోనె సాల్మన్ రాజ్ క్రిస్టియన్‌ల ఐక్యత, హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తున్నారన్నారు. అందువల్లే తాము ఏకగ్రీవంగా సాల్మన్‌రాజుకు మద్దతు ఇస్తూ సీఎం కేసీఆర్ గవర్నర్ కోటాలో గోనె సాల్మన్‌రాజును ఎమ్మెల్సీగా ఎంపిక చేయాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వర్షిప్ సెంటర్ ప్రధాన కార్యదర్శి సునీల్, వర్షిప్ సెంటర్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ల అప్పగింత

విజయనగర్‌కాలనీ: హుమాయూన్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు బుధవారం 50 సెల్‌ఫోన్లు అప్పగించారు. ఆసిఫ్‌నగర్ పోలీస్ డివిజన్ ఏసీపీ ఆర్‌జీ.శివమారుతి ఆధ్వర్యంలో హుమాయూన్‌నగర్ డిటెక్టివ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ అహ్మద్ పాషా ఆధ్వర్యంలో 50 సెల్‌ఫోన్లను రికవరీ చేశారు. రికవరీ చేసిన సెల్‌ఫోన్ల విలువ రూ.7.5 లక్షలు ఉంటుందని తెలిపారు. సెల్‌ఫోన్ల రికవరీలో చాకచక్యంగా వ్యవహరించిన అడిషనల్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్‌రావు, ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి, సిబ్బంది నాగేందర్, సాయికుమార్, రమేష్‌ను అభినందించారు.

మత్స్య సహకార సంఘం చైర్మన్ పదవి గంగపుత్రులకు ఇవ్వాలి



మాట్లాడుతున్న గాలి సత్యనారాయణ తదితరులు

సుల్తాన్‌బజార్: మత్స్య సహకార సంఘం చైర్మన్ పదవి గంగపుత్రులకు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్రంలోని గంగపుత్ర సంఘాలు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం హనుమాన్ టేక్డిలోని బీసీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తెలంగాణ గంగపుత్ర విద్యాభివృద్ధి సంస్థ అధ్యక్షుడు గాలి సత్యనారాయణ, తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం అధ్యక్షుడు మెట్టు ధన్‌రాజ్, తెలంగాణ గంగపుత్ర సంఘాల ఐక్య వేదిక జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు రమావెని లక్ష్మణ్, గంగపుత్ర చైతన్య సమితి అధ్యక్షుడు నర్సింగ్, గంగపుత్రులు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కేవలం చేపలు పట్టే వృత్తి జీవనాధారంగా గంగపుత్రులు జీవిస్తున్నారన్నారు. తమ కులానికి చెందిన మత్స్య సహకార సంఘం చైర్మన్‌ను ముదిరాజ్ అయిన పిట్టల రవీందర్‌కు ఇవ్వడానికి తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. యాదయ్య, విజయ్‌కుమార్, ప్రకాష్, పూసరాజు, బొట్టు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



దినేష్‌సింగ్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న కుమార్

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ఘాట్కు అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సర్దార్ దినేష్ సింగ్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మారెపల్లి కుమార్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సర్దార్ దినేష్‌సింగ్ మాట్లాడుతూ.. ఘాట్కు క్రీడను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరింపజేయడంతో పాటు క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

వ్యాపార సమస్యల పరిష్కారానికి కృషి



అబిడ్స్: వ్యాపార సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక కృషి చేస్తానని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. బేగంబజార్ ప్రాంతంలో పర్యటించి వ్యాపారులతో సమావేశమై వ్యాపారుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆశీష్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వ్యాపారులకు అండగా ఉంటుందన్నారు. వ్యాపారుల సమస్యలను సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు ప్రత్యేక కృషి చేస్తానన్నారు. అన్ని ప్రాంతాల్లో పర్యటించి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తున్నట్లు వివరించారు.

మహ్మద్ అమీర్‌కు పీహెచ్‌డీ

రాయదుర్గం: మనూలో ఇస్లామిక్ స్టడీస్ పరిశోధక విద్యార్థికి పీహెచ్‌డీని ప్రకటించారు. మహ్మద్ అమీర్ ఇస్లామిక్ స్టడీస్ విభాగం హెడ్ ప్రొఫెసర్ మహ్మద్ ఫాహిమ్‌అక్తర్ పర్యవేక్షణలో ఎన్విరాన్‌మెంటల్ పొల్యూషన్-యాన్ ఇస్లామిక్ పర్స్‌పెక్టివ్ అనే అంశంపై థీసిస్‌ను సమర్పించారు.

పరిశుభ్రతపై అవగాహన

గోల్కొండ: నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరి పాత్ర ఉందని బల్దియా ఎంటమాలజీ ఏఈ ఎం.ఏ.ఖయ్యూం అన్నారు. బుధవారం ఆయన షేక్‌పేట్ డివిజన్ టోలిచౌకి బృందావన్ కాలనీలో పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బృందావన్ కాలనీ పరిసరాల హాకర్లతో ఆయన పరిసరాలను శుభ్రంగా ఉంచుతామని ప్రమాణం చేయించారు. పరిసరాల పరిశుభ్రతపైనే మన ఆరోగ్యం ఆధారపడి ఉందన్నారు. కాగా తోపుడు బండ్ల వ్యాపారులు వ్యర్థాలను రోడ్లపైన పారవేయకుండా బల్దియా వారు ఏర్పాటు చేసిన చెత్త కుండీలలోనే వ్యర్థాలను వేయాలని ఆయన సూచించారు. అంతేకాకుండా తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేయాలని ఆయన వారిని కోరారు. చెత్త తరలింపు కోసం బల్దియా వారు ప్రత్యేక యూనిట్లను ఏర్పాటు చేశారని ఆయన అన్నారు.



హాకర్లతో ప్రమాణం చేయిస్తున్న దృశ్యం

మంచిరేవులలో 'మేరీలైఫ్' సమావేశం

మణికొండ: చిరుధాన్యాలు, ఆకుకూరలను కుటుంబానికి అందించినప్పుడే అందరూ ఆరోగ్యంగా ఉంటారని గృహిణి పోషక విలువల గురించి తప్పనిసరి తెలుసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద అన్నారు. బుధవారం నార్సింగి మున్సిపాలిటీ మంచిరేవులలో జరిగిన మేరీ లైఫ్ సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా నీటివృధా, ప్లాస్టిక్ వాడకం, చేతుల పరిశుభ్రత ఆవశ్యకతల గురించి మహిళలకు వివరించారు. ఏఎన్‌ఎం విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు సుధారాణి, నళిని, అనిత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

యూనివర్సిటీ కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలి



మాసబ్‌ట్యాంక్ ఉన్నత విద్యా మండలి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న జేఏసీ నాయకులు

విజయనగర్‌కాలనీ: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలలో కాంట్రాక్ట్ లెక్చరర్స్‌గా విధులు నిర్వహిస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని జేఏసీ నాయకులు బుధవారం మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యా మండలిని ముట్టడించారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ చైర్మన్ డాక్టర్ ఎ.పరశురామ్, కన్వీనర్ డాక్టర్ డి.ధర్మతేజ మాట్లాడుతూ.. తొమ్మిది ఏళ్ల నుంచి సీఎం కేసీఆర్ హామీ మేరకు తాము తప్పకుండా రెగ్యులరైజ్ అవుతామని వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి చొరవ తీసుకుని ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి తమను త్వరితగతిన రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12 యూనివర్సిటీలలో కాంట్రాక్ట్ లెక్చరర్స్‌గా విధులు నిర్వహిస్తున్నవారందరూ పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కో కన్వీనర్లు డాక్టర్ రామేశ్వర్ డాక్టర్ వేల్పుల కుమార్, శ్రీధర్‌కుమార్ లోధ్, సురేష్, శివారెడ్డి, రాజేష్ కన్న డాక్టర్ భూమయ్య, డాక్టర్ వినిత పాండే, ఉపేందర్, డాక్టర్ దశరథన్ పాల్గొన్నారు.

సమాజ సేవకు వైశ్య ఫెడరేషన్ కృషి



పేద కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా, సదానందంగుప్తా

అబిడ్స్: సమాజ శ్రేయస్సుకు ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ నిరంతరం కృషి చేస్తుందని ఆ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సదానందంగుప్తా పేర్కొన్నారు. పురానాపూల్‌లోని కొత్తగా వివాహం జరిగే నిరుపేద కుటుంబానికి ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుస్తె మెట్టెలు, చీర, గాజులు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తరచూ ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్, ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు అండగా ఉండి పలు సేవలు చేస్తామన్నారు. పేద బడుగువర్గాల సంక్షేమానికి కృషి చేస్తామని వెల్లడించారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే గోషామహల్ అభివృద్ధి



మంత్రి తలసానిని కలిసిన నందకిశోర్ వ్యాస్ బిలాల్, కాలనీ ప్రతినిధులు

అబిడ్స్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలోనే గోషామహల్ నియోజకవర్గంలో కోట్లాది రూపాయాల అభివృద్ధి పనులు చేపట్టామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. నియోజకవర్గం నలుమూలలా కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు గతంలో ఎన్నడూ జరగలేదన్నారు. బుధవారం గోషామహల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఆధ్వర్యంలో గ్యాస్‌బాగ్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి తలసానిని కలిసి గ్యాస్‌బాగ్ కాలనీలో అధునాతన కమ్యూనిటీ హాల్ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. గ్యాస్‌బాగ్ కాలనీలో మోడ్రన్ కమ్యూనిటీ హాల్‌ను నిర్మించేందుకు అధికారులు కృషి చేస్తారని అన్నారు. వెంటనే సంబంధిత ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇచ్చి కమ్యూనిటీ హాల్ నిర్మించే విధంగా పాటు పడుతామన్నారు. నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. గ్యాస్‌బాగ్ కాలనీలో అధునాతన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 60 శాతం నిధులు ప్రభుత్వం చెల్లిస్తే మిగతా 40 శాతం నిధులు కాలనీ అసోసియేషన్ చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు హనుమాన్ దాగా రోహిత్ కుమార్ అరవింద్ షునార్, గోకుల్‌చంద్ ఉపాధ్యాయ తదితరులు పాల్గొన్నారు.

జూన్ 3న జైన్ సంక్షేమ భవన భూమి పూజ



మాట్లాడుతున్న జైన్ సేవా సంఘం ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: జైనుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ఉప్పల్ బగాయత్‌లో కేటాయించిన రెండు ఎకరాల స్థలంలో జూన్ 3న భూమి పూజ నిర్వహించనున్నట్లు జైన్ సేవా సంఘం అధ్యక్షుడు యోగేష్ జైన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం హైదర్‌గూడలోని ఎస్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం జైనుల సంక్షేమానికి ఉప్పల్‌లో రెండు ఎకరాల స్థలం కేటాయించడాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. తెలంగాణలో ఉత్తర భారతీయులకు సముచిత స్థానం కల్పిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో జైన్ సేవా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ జైన్, కార్యదర్శి భరత్ జైన్, అశోక్ జైన్, ఇమాన్షు జైన్, ప్రవీణ్ పాండ్యా తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే



గోల్కొండ: రాష్ట్రంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ తుడిచి పెట్టుకుపోవడం ఖాయమని బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు ఆర్. మాణిక్ ప్రభు, గోదా లక్ష్మీకాంత్ యాదవ్ అన్నారు. బుధవారం గుడిమల్కాపూర్ డివిజన్‌లో బీజేపి గోల్కొండ జిల్లా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో వివార్ లేఖన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ మరోసారి, రాష్ట్రంలో బీజేపీ ఈసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్, నామా యాదగిరి, సంగన్న, మధుసూదన్ తదితరులన్నారు.

దివ్యాంగులందరికీ బస్‌పాస్‌లు ఇవ్వాలి



మణికొండ: గండిపేట మండల పరిధిలో ఉన్న దివ్యాంగులందరికీ టీఎస్ ఆర్టీసీ తప్పనిసరిగా బస్‌పాస్‌లను అందించాల్సిన అవసరం ఉందని మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కొండాపూర్ ఆసుపత్రిలో ఉచిత బస్‌పాస్‌లకు అవసరమైన సదరం పరీక్షలను నిర్వహించారు. అక్కడికక్కడే అర్హత కలిగిన వారికి బస్‌పాస్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో బస్‌పాస్‌లు ఇచ్చిన వారితో పాటు కొత్త వారికి ఇప్పటి వరకు బస్‌పాస్‌లు రాని వారికి సైతం పరీక్షలు నిర్వహించి జారీ చేయాలని కోరారు. మణికొండ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు బీరప్ప, నాయకులు ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని యువతి ఆత్మహత్య

లంగర్‌హౌస్: ఉరేసుకొని యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన లంగర్‌హౌస్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ మాధవీలత తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా రాకంచెర్లలో నివాస ఉంచే భూక్యా నాయక్, మంగ్లీ భాయ్ దంపతుల కూతురు వర్షిత (19). ఈ దంపతులు పాట్నాలో కూలి పని చేసుకుంటున్నారు. వర్షిత స్థానికంగా 10వ తరగతి పూర్తి చేసుకుని స్థానికంగా నివాసం ఉండే అశోక్ ప్రేమలో పడింది. గతేడాది వీరిద్దరూ తమ తమ తల్లిదండ్రులను ఒప్పించి ప్రేమ వివాహం చేసుకుని లంగర్‌హౌస్ ప్రశాంత్‌నగర్‌లో ఉంటున్నారు. అశోక్ టైల్స్ పని చేస్తాడు. వీరు అన్యోనంగా ఉంటున్నారు. సోమవారం ఉదయం పని నిమిత్తం అశోక్ పరిగి వెళ్లాడు. అదే రోజు రాత్రి 11.45 గంటలకు దాదాపు గంట సేపు వర్షితతో మాట్లాడు. భర్త ఇంట్లో లేకపోవడంతో తనకు వరుసకు సోదరి ఇంట్లో వెళ్లి పడుకుంది. బుధవారం నిద్రలేచి తన ఇంటికి వచ్చిన వర్షిత కొద్ది సేపు భర్తతో మాట్లాడి మళ్లీ ఫోన్ చేస్తానంటూ ఫోన్ కట్ చేసింది. అశోక్ తిరిగి భార్య వర్షితతో ఫోన్ మాట్లాడటానికి ఎన్ని సార్లు ఫోన్ చేసిన ఫోన్ ఎత్తలేదు. అశోక్ ఇంటి యజమానికి ఫోన్ చేసి తన భార్య ఫోన్ ఎత్తడం లేదని, తన భార్యతో ఫోన్ మాట్లాడాలని ఇంటి యజమానితో చెప్పాడు. ఇంటి యజమాని ఇరుపొరుగు వారితో ఇంటికి వెళ్లగా అప్పటికే వర్షిత ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న అశోక్ పరిగి నుంచి లంగర్‌హౌస్ చేరుకున్నాడు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియాకు పంపించాడు. అశోక్ వర్షిత దంపతుల మధ్య ఎటువంటి గొడవలు లేవని ఇంటి యజమానితో పాటు ఇరుపొరుగు వారు తెలిపారు. భర్త లేని సమయంలో తన సోదరి ఇంటికి వెళ్లి పడుకున్న వర్షితకు అక్కడ ఏమన్న గొడవ జరిగి మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుందా, ఇంకా ఏమైనా కారణం ఉందని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.